JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 314 03 శుక్రవారం జూలై 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## కాళేశ్వరం వైఫల్యాలపై హరీశ్ రావు సమాధానం చెప్పాలి

జనసైన్యం సిటి

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ & బి గెస్ట్ హౌస్ లో గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు రెండేళ్లు కూడా గడవక ముందే కుంగిపోవడానికి కారకులెవరో మాజీ మంత్రి హరీశ్ రావు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో ఆయన ధ్వజమెత్తారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న హరీశ్ రావుకు, రోజుకో వంద అబద్ధాలు చెబితేనే నిద్ర పడుతుందని ఎద్దేవా చేశారు.

?రెండేళ్లకే కుంగిపోయిన ప్రాజెక్టులు.

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తామే పెద్ద ఇంజనీర్లలా కేసీఆర్, హరీశ్ రావు కాళేశ్వరం డిజైన్లను మార్చారని విమర్శించారు. "నువ్వూ, నీ మామ (కేసీఆర్) ఇంజనీర్ల అవతారమెత్తి కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు రెండేళ్లు తిరక్కుండానే ఎందుకు కుంగిపోయాయి? దీనికి రాష్ట్ర ప్రజలకు ఏం సమాధానం చెబుతారు?" అని ప్రశ్నించారు. కిందికి పోయే నీళ్లను ఎత్తిపోసే విధానం ప్రపంచంలో ఎవరూ చేయనట్లుగా గతంలో బస్సులు పెట్టి మరీ టూరిస్ట్ ప్లేస్‌లా చూపించారని, కానీ నేడు ఆ ప్రాజెక్టులు



ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు.

కొట్టుకుపోయిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, ఇప్పటికే కొన్ని మరమ్మతు పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేసిందేమీ లేదు!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుని వాళ్ళ పార్టీని బతికించుకుందే తప్ప, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతాంగానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలు ప్రారంభించిన ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్ట్ ద్వారా ఫస్ట్ ఫేజ్‌లోనే 5,40,000 ఎకరాలకు సాగునీరు అందిందని గుర్తు చేశారు. కానీ, కాళేశ్వరం పేరుతో కట్టిన లిఫ్టుల ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనీసం 50 వేల ఎకరాలకైనా నీళ్లిచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇక్కడి నీళ్లను మెదక్ జిల్లాలోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్లకు తరలించుకుపోయి తమ సొంత భూములను తడుపుకున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యమే కొనడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని, కానీ సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రికార్డు స్థాయిలో 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. అలాగే నష్టం వచ్చినా కూడా మార్క్‌ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను సేకరించిన ఘనత తమదేనన్నారు. ఏకకాలంలో రూ. 21 వేల కోట్లు కేటాయించి 25 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశామని, లబ్ధి పొందిన రైతులు మళ్లీ బ్యాంకులకు వెళ్లి కొత్త రుణాలు తెచ్చుకుంటున్నారని వివరించారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ఇలా ఏకకాలంలో రుణమాఫీ జరిగి, మళ్లీ లోన్లు తెచ్చుకున్న ఒక్క రైతునైనా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చూపించగలరా అని సవాల్ విసిరారు.

త్వరలోనే రూ. 9,000 కోట్ల రైతు భరోసా జమ

ఇప్పటికే మూడు ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ. 4,000 కోట్లకు పైగా రైతు భరోసా నిధులు విడుదల చేశామని వెల్లడించారు. రాబోయే ఏడు రోజుల్లో మిగతా రైతులందరికీ ఎకరాకు రూ. 6,000 చొప్పున దాదాపు రూ. 9,000 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయబోతున్నట్లు ప్రకటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు రూ. 500 బోనస్ (గత రెండు సీజన్లలో రూ. 1050 కోట్లు, రూ. 1800 కోట్లు) వంటి పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుంటే బీఆర్ఎస్ నేతలు అధికారం పోయిన ఫ్రస్ట్రేషన్‌లో పిచ్చి కూతలు కూస్తున్నారని, ఇప్పటికైనా అబద్ధాల ప్రచారం మానుకుని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని హితవు పలికారు.ఈ మీడియా సమావేశంలో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ ఆకుల నరసయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్ లు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జనసైన్యం సిటి

సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్ఖానా గడ్డలోని ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాలను (వ్యవసాయ మార్కెట్ సమీపం, పెద్దపల్లి రోడ్) సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కళాశాలకు అత్యవసరంగా నూతన భవనం అవసరమని, సైన్స్ విద్యార్థులకు అత్యంత అవసరమైన ప్రయోగశాల (ల్యాబ్) భవనం లేకపోవడంతో ప్రాక్టికల్స్ నిర్వహణ తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. విద్యార్థులు కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేకపోవడం, తగినన్ని తరగతి గదులు లేకపోవడం వల్ల విద్యా బోధనకు ఆటంకం కలుగుతోందని తెలిపారు.ఈ ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాలకు గొప్ప చరిత్ర ఉందని మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది నేడు మంత్రులు, మేయర్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు మరియు వివిధ రంగాల్లో ప్రముఖులుగా ఎదిగారని తెలిపారు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన విద్యాసంస్థ నేడు కనీస మౌలిక వసతులు లేక నిర్లక్ష్యానికి




సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

గురికావడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ కళాశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, అవసరమైన నిధులు మంజూరు చేసి అన్ని సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా విద్యార్థినుల భద్రతకు ఇది ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. కళాశాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న "జాబు కోర్సుకు అవసరమైన ఫ్యాకల్టీ లేక విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించక ఇంటర్నెట్,టీసివేసిన పరిస్థితి,కరెంట్ బిల్లులు,స్టేషనరీ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుద్ధ్యం, మరమ్మతులు, విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పన కూడా సక్రమంగా జరగడం లేదన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక నిధులు కేటాయించి కళాశాలలో నెలకొన్న అన్ని సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాలకు వెంటనే నూతన భవనం నిర్మించడం, ఆధునిక ల్యాబ్‌ల ఏర్పాటు, సరిపడా బెంచీలు, ఫర్నిచర్ అందించడం, ప్రహరీ గోడ నిర్మించడం, అదనపు తరగతి గదులు నిర్మించడం, కళాశాల నిర్వహణకు తగిన నిధులు విడుదల చేయడం వంటి చర్యలను ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మిల్కూరి వాసుదేవరెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. రాజేశం, నరేష్ పటేల్, నాయకులు జి. శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, శివ కుమార్, భోగేశ్వర్, సన్నీ,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.






నర్సయ్య కు జన్మదిన శుభాకాంక్షలు



సౌరయ్య కు జన్మదిన శుభాకాంక్షలు

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**జనసైన్యం సిటి**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాఠశాలలు ప్రారంభమైన రోజునే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందిస్తామని హామీ ఇచ్చి, నేటి వరకు ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కూడా పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించకపోతే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో పాటు ఎంఈవో (MEO) పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పెరుగుతున్నప్పటికీ వాటిని పర్యవేక్షించే అధికారులు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రానికి ఇప్పటికీ పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు విద్యార్థుల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే పరిమితమవుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు అప్పగించడం వల్ల అనేక చోట్ల నాణ్యతలేని భోజనం అందుతోందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే మహిళా సంఘాల ద్వారా మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి కార్యాలయాలను ముట్టడిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి భోగేశ్వర్, గట్టు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్, సన్నీ, రక్షక్, నాయకులు సాయి, ఉదయ్, మనోజ్, శ్రీశాంత్, అభినవ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి



జనసైన్యం సిటి

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని . ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి అనేక సమస్యలు పేరుకుపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాలు ( - AISF- SFI -PDSU- AISB-PDSU) కరీంనగర్ జిల్లా కమిటీలు విమర్శించాయి. తెలంగాణ రాష్ట్ర విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జూలై 10వ తేదీన కెజీ నుండి పిజి వరకు విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ఈ బంద్ కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు, తల్లిదండ్రులు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. స్థానిక గణేష్ నగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో గల ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో వాపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, విద్యార్థుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు. ఈ బంద్‌కు రాష్ట్రంలోని విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, మహిళా విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టి ప్రతి విద్యాసంస్థలో ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020) అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఈ బంద్ ద్వారా డిమాండ్ చేస్తున్నాము. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత. కానీ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. విద్యను కాపాడుకోవడం, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, విద్యార్థుల హక్కులను సాధించుకోవడం కోసం జూలై 10న జరిగే విద్యా సంస్థల బంద్‌ను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల కరీంనగర్ జిల్లా కమిటీలు విజ్ఞప్తి చేస్తోంది. అనంతరం బంద్ పోస్టర్లు ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కామ్పల్లి అరవింద్ ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతీకం రాజశేఖర్ గౌడ్, పిడిఎస్యు రాష్ట్ర కోశాధికారి అంగడి కుమార్, పి డి ఎస్ యు న్యూ డెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు లోకిని రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, బోయిని విష్ణు, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షుడు వెల్దీ రాజు,జిల్లా కోశాధికారి తాళ్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

## నడి రోడ్డుపై కారును వెంబడిస్తూ హల్చల్ చేసిన పోకిరీల అరెస్ట్




**జనసైన్యం సిటి**

హైదరాబాద్ నగర శివారులోని ఘట్కేసర్ నుండి బోడుప్పల్ హైవే మీద అర్ధరాత్రి వేళ పెళ్లికి వెళ్లి కారులో వస్తున్న కుటుంబాన్ని బైక్‌లపై వెంబడిస్తూ, భయభ్రాంతులకు గురిచేసిన పోకిరీలు .బైక్‌లను కారుకు అడ్డంగా తిప్పుతూ, కేకలు వేస్తూ భయపెట్టే ప్రయత్నం చేసిన యువకులు .భయభ్రాంతులకు గురైన కారులోని మహిళలు, చిన్నారులు .సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితులు భువనగిరి మండలం హన్మాపురానికి చెందిన రంగ శివ(21), అఖిల్(20)లుగా పోలీసుల గుర్తింపు.నిందితులను అరెస్ట్ చేసి బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు..!

## పుల్లూరు ఏపీజీవీబీ బ్యాంకులో ఖాతాలపై లాక్‌లు తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



**జనసైన్యం సిటి**

సిద్ధిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ఏపీజీవీబీ బ్యాంకులో మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు, పింఛన్ లబ్ధిదారుల ఖాతాలకు లాక్‌లు విధించడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతు భరోసా, వడ్ల, ఇతర సంక్షేమ పథకాల నిధులు మరియు పింఛన్ నగదును కూడా ఖాతాల నుంచి తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పుల్లూరు ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ, ప్రజల ఖాతాలకు లాక్‌లు విధించడం వల్ల రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు భరోసా సహా ప్రభుత్వం జమ చేస్తున్న సంక్షేమ నిధులను సైతం పొందలేకపోవడం పేర్కొన్నారు.బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడిన సందర్భంగా, వీలైనంత త్వరగా అన్ని సమస్యలను పరిష్కరించి, అర్హులైన ఖాతాదారుల ఖాతాలపై ఉన్న లాక్‌లను వెంటనే తొలగించాలని, సరైన కారణం లేకుండా ఎవరికి కూడా ఖాతాలపై లాక్‌లు విధించవద్దని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి రాజు గార్లు పాల్గొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం

**జనసైన్యం సిటి**



2020లో వెంకీ దగడ్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా ఓ బాలికకు మెసేజ్ పెట్టిన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన వెంకటస్వామి(29).కోవిడ్ సమయం కావడంతో మీర్ పేట్ పీఎస్ పరిధిలో ఇంట్లోనే ఉంటూ నాన్నమ్మ ఫోన్‌లో ఆన్‌లైన్ పాఠాలు నేర్చుకుంటూ, అనుకోకుండా వెంకటస్వామి మెసేజ్‌కు రిప్లై ఇచ్చిన బాలిక(11).దీన్ని ఆసరాగా చేసుకొని బాలికకు అసభ్యకర మెసేజులు పంపగా, ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాక్ చేయడంతో నేరుగా ఫోన్ చేయడం ప్రారంభించి, 2020 డిసెంబర్ 2న ఇంట్లోని డబ్బులు తీసుకొని ఘట్ కేసర్‌కు రావాలని లేదంటే మీ అమ్మను కిడ్నాప్ చేస్తానని బెదిరించిన వెంకటస్వామి.భయపడి తల్లి పర్సులో నుండి రూ.18 వేలు తీసుకొని ఘట్ కేసర్‌కు వెళ్ళగా, అక్కడి నుండి బాలికను కిడ్నాప్ చేసి ాూ రావు నగర్‌లోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్ళి వెంకటస్వామి అఘాయిత్యం.వెంకటస్వామి ఇంటి బయటకు రాగానే ఫోన్ నుండి తల్లికి లోకేషన్ పంపగా, ఆమె ఫిర్యాదు చేయడంతో, బాలికను కాపాడి వెంకటస్వామిని అరెస్ట్ చేసిన పోలీసులు.కేసు విచారించి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.19 వేలు జరిమానా విధించి, బాధితురాలికి రూ.2 లక్షలు నష్టపరిహారాన్ని మంజూరు చేసిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ పొక్సో కోర్టు.

## రహీంఖాన్పేట్ గ్రామంలో గర్ల్ చైల్డ్ అవేర్నెస్ ప్రోగ్రాం




ఇల్లంతకుంట మండలం రహీంఖాన్పేట్ ఆదర్శ పాఠశాలలో ఈ రోజు గర్ల్ చైల్డ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల బాలికలను ఉద్దేశించి,సఖి కేంద్రం గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ గురించి,సమాజంలో వారు వ్యవహరించాల్సిన తీరును మరియు సామాజిక మాధ్యమాల దుర్వినియోగం గురించి ఠ-ష్ట్రబఎ జెండర్ స్పెషలిస్ట్ దేవిక, అర్చన, ఐసిపిఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గగన్, సఖి సెంటర్ కేసు వర్కర్ కవిత గార్లు వివరించారు. పిల్లలు చెడు దారిలో వెళ్లకుండా ఇది చాలా ఉపయోగపడ్తుందని ప్రిన్సిపాల్ ఠతీ. అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరీంనగరం పురవీధుల్లో జరిగే జగన్నాథ రథోత్సవాన్ని విజయవంతం చేయాలి




కరీంనగరం పురవీధుల్లో ఐదవ జగన్నాథ రథయాత్ర నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారని, ఈ రథోత్సవంలో పాల్గొని జగన్నాథుడి రథం లాగి తమ తమ జన్మలను చరితార్థం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ రోజు జగన్నాథ రథయాత్ర నిర్వహణ కమిటీతో కలిసి రథయాత్ర కరపత్రాలను విజుదల చేయి మాట్లాడుతూ పూరీ పురవీధుల్లో 16 జూలై రోజు జరుగుతున్న జగన్నాథ రథయాత్ర పుణ్య గడియల్లో అదే రోజు మన నగరంలో జగన్నాథుడి రథాన్ని లాగే భాగ్యం భక్తకోటికి దగ్గడం ఓ అదృష్టం అని అన్నారు. 16 జూలై రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు మహాశక్తి దేవాలయం నుంచి రథయాత్ర ప్రారంభమై సెయింట్ జాన్స్ స్కూల్, మంకమ్మతోట లేబర్ అడ్డా, మంకమ్మతోట, తెలంగాణ చౌక్, బస్ స్టాండ్, టవర్ సర్కిల్, వైశ్య భవన్ వరకు కొనసాగి ప్రవచనాలు, పూజల అనంతరం ప్రసీద వితరణతో రథయాత్ర ముగుస్తుందని అన్నారు. కరీంనగర్ జిల్లా భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కన్న కృష్ణ, డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. రథయాత్రలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లను మునిసిపల్ కమీషనరేట్ పక్షాన చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

## తెలంగాణ రక్షణ సేన తలపెట్టిన భూ పోరాటం విజయవంతం.




ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో తెలంగాణ రక్షణ సేన తలపెట్టిన భూ పోరాటం విజయవంతం.బోడుప్పల్ లో భూ పోరాటం చేస్తుండగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మతో సహా వందలాది మంది టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారుల అరెస్ట్ చేయడం దుర్మార్గం అని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయమని ఉద్యమకారులకు రెండు వందల యాబై గజాల ఇంటి స్థలం ఇవ్వాలని అదేవిధంగా ఉద్యమకారులకు పించను, అదేవిధంగా గుర్తింపు కార్డులు, తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక బోర్డ్ ఎర్పాటు చేస్తామని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామి అమలు చెయ్యాలని అడిగినందు ఈ విధంగా అక్రమంగా అరెస్టులు చేసినందుకు తీవ్రంగా ఖండిస్తున్నామనిమనం అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామ లేక నియంతృత్వంలోఉన్నామ అనే అనుమానం కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన హామిలు అమలు చెయ్యకుండా తన వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికి ఇలాంటి అణచివేతకు అక్రమ అరెస్టు లకు దిగుతుందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. జులై రెండవ తేదీన భూ పోరాటం చెయ్యాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు ఉప్పల్ బగాయత్ చేరుకున్నారు. అందులో భాగంగా కరీంనగర్ జిల్లా నుండి పెద్దఎత్తున తెలంగాణ రక్షణ సేన నాయకులు తెలంగాణ ఉద్యమకారుల పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలిసులు కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తోపాటు రాష్ట్ర నాయకులు లింగంపల్లి నాగరాజు జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, కంతాల రోజా రెడ్డి, కుతాడి రజిత, కొరిమి పద్మ, విద్యార్థి నాయకులు చెన్నమల్ల చైతన్య, యండి ఉమర్, నగునురి రమేష్ చారి తదితరులను పోలిసులు అరెస్ట్ చేసి ఘట్కేసర్ పోలిస్ స్టేషన్ లో సాయంత్రం వరకు ఉంచుకుని స్వత పుచికత్తు మీద వదిలి పెట్టారు.

## గొల్లపల్లి చింతకుంటపల్లెలో పశువులకు లంపీ వైరస్ నిరోధక టీకాల కార్యక్రమం




గొల్లపల్లి చింతకుంటపల్లె గ్రామ రైతుల పశుసంపదను రక్షించే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ రడం లక్ష్మి (ప్రవీణ్) ఆధ్వర్యంలో లంపీ స్కిన్ వైరస్ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆవులు, లేగదూడలకు ఉచితంగా లంపీ వైరస్ నిరోధక టీకాలు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రడం లక్ష్మి (ప్రవీణ్ ) మాట్లాడుతూ, పశువుల ఆరోగ్య పరిరక్షణ రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పశువులకు టీకాలు వేయించుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పశుసంవర్ధక శాఖ డాక్టర్ పూర్ణచంద్రిక ఉపసర్పంచ్ ఒరుపుల లక్ష్మణ్ గారు మరియు వార్డు సభ్యులు పత్రిఅంజయ్య దాసరి ఎల్లయ్య రడం బాబాయి ముద్దల అజయ్ పంచాయితి కార్యదర్శి సతీష్ ఆరిఫ్ మరియు సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ బ్యాగుల వ్యర్థాలు

## (03 జూలై "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం" సందర్భంగా)

**ఆచార్య : మధుసూదన్ రెడ్డి బుర్ర**

నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేదు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకెట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970-1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్చిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్స్‌గా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు.

**అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం-2026 :**

ఒక నాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట 03 జూలై రోజున "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం" పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. 2026 దినోత్సవ ఇతివృత్తంగా "సింగిల్-యూజ్ ప్లాస్టిక్స్ విముక్తి : సుస్థిరమైన భవిష్యత్తు వైపు" అనబడే అంశాన్ని తీసుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ భూతాన్ని తరమడానికి ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలని పిలుపునిస్తున్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకనబద్దులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు.

**ప్లాస్టిక్ బ్యాగులు లేని పౌర సమాజ నిర్మాణం సాధ్యమా !**

మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం, ప్లాస్టిక్ కవర్స్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలు మార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారు చేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి. సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తున్నాయి.

అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.









# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

ఫోన్ నెంబర్

9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు






మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం



## నరేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు



## విజయ్ శంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు



## శ్రీనివాస్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు

# కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం చేయాలి.



**జనసైన్యం సిటి**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాసంస్థలను పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయ కేంద్రాలుగా మార్చే విధానాన్ని నిలిపివేయాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు.ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి బలవంతంగా చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ, విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ఒకవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇస్తూ, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడం ప్రభుత్వ విద్యకు గోరి కట్టడమేనని మండిపడ్డారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు ఇప్పటికీ అందించలేదని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయలేదని, మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఇప్పుడు పాఠశాలలను మూసివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, విద్యార్థులు లేరనే పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రతిపాదనలు సిద్ధం చేయడం ప్రజావ్యతిరేక విధానమని విమర్శించారు. సుమారు 10 వేల పాఠశాలలను మూసివేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, తాజాగా 27 వేల పాఠశాలలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ అసలు ఉద్దేశాన్ని బయటపెడుతున్నాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, అదే విధానంలోని రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కార్యక్రమాన్ని అమలు చేయడం బీజేపీ విధానాలకు అనుకూలంగా వ్యవహరించడమేనని విమర్శించారు.తమిళనాడు ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రిస్తూ వాటిని బహిరంగంగా ప్రదర్శించే విధానాన్ని అమలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఫీజుల దోపిడీపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని అన్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం, రన్నింగ్ వాటర్ వంటి ప్రాథమిక వసతులు కల్పించలేదని తెలిపారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను కూడా శాశ్వతంగా భర్తీ చేయకుండా ఎఫ్ఏసీలతోనే కొనసాగిస్తున్నారని విమర్శించారు.మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థలకు అప్పగించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందడం లేదని అన్నారు. ప్రభుత్వం డిజిటల్ విద్య, ఫిన్లాండ్ విద్యా విధానం గురించి గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, అనేక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు కూడా లేవని, అలాంటప్పుడు నాణ్యమైన డిజిటల్ విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా దాన్ని నిర్వీర్యం చేసి పేద విద్యార్థులకు అందకుండా చేసే విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.ఆందోళన సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు పిడిగుద్దులు, లాఠీలతో దాడి చేశారని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె. అశోక్ రెడ్డిపై తీవ్రంగా లాఠీచార్జ్ చేసి గాయపరిచారని తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది.

అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారని, ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అరెస్టయిన వారిలో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వై. ప్రణయ్, కార్తీక్, లెనిన్ గువేరా, రమేష్, వెన్నెల, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, లిఖిత్, చరణ్, తరంగ్, అరుణ్, నాగేందర్, స్టాలిన్, వినోద్, శ్రీరామ్, ప్రవీణ్, శ్రీకాంత్, చరణ్ తదితరులు ఉన్నారు.

# దర్శనం గంగాధర్ అంతిమ యాత్రలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు



రుద్రంగి:- బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి దర్శనం గంగాధర్ గారు మద్య రాత్రి అనారోగ్యంతో మరణించగా ఈ రోజు మధ్యహ్నం రుద్రంగి లో జరిగిన అంతిమ యాత్ర లో బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం స్థానిక నాయకులతో కలిసి గంగాధర్ అన్న అంతిమయాత్రలో పాల్గొని ఆయన పార్థివదేహానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం గ్రామ వీధుల్లో జరిగిన అంతిమయాత్రలో పార్టీ నాయకులు ఆయన పై పాటలు పాడటం తో గ్రామస్థులు పార్టీ కార్యకర్తలు కన్నీటి పర్యంతమయ్యారు. నిషాని రామచంద్రం ఎనగందుల వెంకన్న మేకల మునీందర్ లు గంగాధర్ పాడే మోసాలు. ఉమ్మడి జిల్లా నుండి నాయకులు కార్యకర్తలు గంగాధర్ చివరి చూపు కోసం తరలి వచ్చారు. పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రామచంద్రం మాట్లాడుతూ గంగాధర్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ముప్పై సంవత్సరాలు గా ఏ పార్టీ లోకి వెళ్లకుండా పూలే అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు. ఒక పక్క దొరల నియంతృత్వం కొనసాగుతుందని ఈ ప్రాంతంలో యువకులు మావోయిజం వైపు పోతుంటే సామాజిక పరివర్తన కోసం అంబేడ్కరిజమే సరైనదని అందుకు బీఎస్పీ ఒక్కటే బహుజనుల మీద జరుగుతున్న వివక్ష దోపిడి దాడుల నుండి కాపాడుతుందని వివరించి ఎంతో మందిని బీఎస్పీ వైపు ఆలోచింప చేశారని గుర్తు చేశారు. బట్టు రామచంద్రం గజ్జేల అశోక్ లు పాడిన పాటలకు ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆయన సంస్మరణ సభ కోసం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం కోసం పార్టీ నాయకులు అందరు విరాళాలు అందించారు అందులో ., అడ్వకేట్ నిషాని రామచంద్రం ,ఛీఫ్ జోన్ ఇంచార్జి అదిలాబాద్ ఆర్థిక సహాయం.5000/- అందించారు ,.

2)ఎనగందుల వేంకన్న ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 1000/-

3)బోయిని బాబు ,కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి గారు ఆర్థిక సహాయం.2000/-మరియు

బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు అందరూ కలిసి ఆర్థిక సహాయం గా 130000/-ఇవ్వడం జరిగింది

విరాళాలు అందించిన వారిలో మేకల మునీందర్, స్వామి గౌడ్, రమేష్ చంద్ర నాయక్ దొబ్బల నరేష్ లు ఇంకా తదితర నాయకులు ఉన్నారు . అంతిమ యాత్ర లో బీఎస్పీ స్థానిక నాయకులు దయ్యాల ఉదయ్ , కట్కూరి శంకర్ కాదాసు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం మారొచ్చు, అధికారాలు మారొచ్చు, పోలీసులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి దర్యాప్తు కోసం వెళ్లాల్సిన పరిస్థితులు రావొచ్చు. కానీ చట్టం మాత్రం మారదు. రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులు, పౌరుల ప్రాథమిక హక్కులు, మానవ గౌరవం ఎప్పటికీ మారకూడదు.

ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లో తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్టు కేవీఆర్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసిన తీరుపై వ్యక్తమవుతున్న తీవ్ర అభ్యంతరాలు ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ముఖ్యంగా అరెస్టు ప్రక్రియలో ఆయన కుటుంబ సభ్యులు ఎదుర్కొన్న పరిస్థితులు, ఆయన భార్య పట్ల పురుష పోలీసులు ప్రవర్తించిన అనుచిత ప్రవర్తనపై ఆరోపణలు రావడం, ఈ వ్యవహారాన్ని కేవలం ఒక క్రిమినల్ కేసు పరిధిలో కాకుండా ప్రజాస్వామ్య హక్కులు, మీడియా స్వేచ్ఛ, మానవ హక్కులు, సమాఖ్య స్ఫూర్తి కోణాల్లో కూడా పరిశీలించాల్సిన అవసరాన్ని సృష్టించాయి.

ఏ వ్యక్తి ఎంత తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నా, అతడిని అరెస్టు చేసే సమయంలో చట్టం నిర్దేశించిన విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలి. ప్రత్యేకించి రాత్రివేళల్లో మరో రాష్ట్రంలో అరెస్టు చేయడం, స్థానిక పోలీసులతో సమన్వయం, గుర్తింపు వివరాలు, చట్టపరమైన ప్రక్రియ, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలన్నీ అత్యంత కీలకమైనవి. వీటిలో ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా అది ప్రజల్లో అనుమానాలకు, ఆందోళనలకు దారితీస్తుంది. చట్టాన్ని అమలు చేయాల్సిన సంస్థలే చట్టబద్ధతపై ప్రశ్నలు ఎదుర్కొంటే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది.

ఈ ఘటనలో అత్యంత తీవ్ర విమర్శలకు గురవుతున్న అంశం కేవీఆర్ భార్యతో పోలీసులు ప్రవర్తించిన తీరుపై వచ్చిన ఆరోపణలే. ఆమె తన భర్తను తీసుకెళ్లవద్దని వేడుకుంటున్న సమయంలో పురుష పోలీసులు బలవంతంగా పక్కకు లాగారని, అక్కడ మహిళా పోలీసులు లేకపోయారని సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల ఆధారంగా అనేక జర్నలిస్టు సంఘాలు, పౌరహక్కుల వేదికలు, తెలంగాణ ఉద్యమకారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే అది కేవలం పోలీసు మర్యాదల ఉల్లంఘన మాత్రమే కాదు; మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యతను విస్మరించిన చర్యగా కూడా పరిగణించాల్సి ఉంటుంది.

భారత న్యాయవ్యవస్థ అనేక తీర్పుల ద్వారా అరెస్టుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించింది. అరెస్టు అనేది శిక్ష కాదు. అది దర్యాప్తులో భాగమైన ఒక చట్టపరమైన చర్య మాత్రమే. అందువల్ల అరెస్టు చేసే విధానం కూడా చట్టబద్ధంగా, పారదర్శకంగా, గౌరవప్రదంగా ఉండాలని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. ప్రత్యేకించి మహిళలతో వ్యవహరించే సమయంలో మహిళా సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పునరుద్ఘాటించింది. ఈ ప్రమాణాలకు విరుద్ధంగా వ్యవహరించారనే



అభిప్రాయం ప్రజల్లో ఏర్పడితే పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠే దెబ్బతింటుంది.

ఈ సంఘటన తర్వాత మరో యూట్యూబర్ అరెస్టు కూడా జరగడంతో, విమర్శనాత్మక స్వరాలను లక్ష్యంగా చేసుకుంటున్నారనే సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రభుత్వాలను విమర్శించడం, రాజకీయ నాయకులపై ఘాటైన వ్యాఖ్యలు చేయడం ఎల్లప్పుడూ చట్టపరంగా సమర్థనీయమని చెప్పలేం. ద్వేషప్రచారం, పరువునష్టం, హింసకు ప్రేరేపించే వ్యాఖ్యలు చట్టపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయి. అయితే అలాంటి సందర్భాల్లో కూడా చట్టం ప్రతీకార సాధనంగా కాకుండా న్యాయపరమైన సాధనంగా మాత్రమే ఉపయోగించబడాలి. జర్నలిస్టులు, యూట్యూబర్లు, సామాజిక మాధ్యమ కార్యకర్తలపై కేసులు నమోదవుతున్నప్పుడు చట్ట అమలులో సమానత్వం, పారదర్శకత అత్యంత అవసరం.

తెలుగు రాష్ట్రాల మధ్య పరిపాలనా సహకారం అవసరమే. కానీ ఆ సహకారం రాజ్యాంగ విలువలను బలపరచేదిగా ఉండాలి; ప్రజల్లో భయం లేదా అనుమానం పెంచేదిగా కాకూడదు. ఒక రాష్ట్రానికి చెందిన పోలీసులు మరో రాష్ట్రంలో చేపట్టే ప్రతి చర్య స్థానిక ప్రజల మనోభావాలపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ఇలాంటి ఆపరేషన్లు అత్యంత బాధ్యతతో, చట్టపరమైన ప్రమాణాలకు కట్టుబడి నిర్వహించాల్సిన అవసరం ఉంది.



తెలంగాణలో ఇప్పటికే ఈ ఘటనపై జర్నలిస్టు సంఘాలు, పౌరహక్కుల కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్న పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జర్నలిస్టులపై ఒత్తిడి పెంచుతున్నారనే భావన బలపడితే అది మీడియా స్వేచ్ఛకు ప్రతికూల సంకేతంగా మారుతుంది. స్వేచ్ఛాయుత మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా పరిగణించబడుతుంది. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంది. అదే సమయంలో మీడియా కూడా చట్టబద్ధ పరిమితుల్లో పనిచేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. ఈ రెండు సూత్రాల మధ్య సమతుల్యత కోల్పోతే ప్రజాస్వామ్య ఆరోగ్యం దెబ్బతింటుంది.

ఈ వ్యవహారం మరో ప్రమాదకరమైన కోణాన్ని కూడా బయటపెడుతోంది. తెలంగాణలో ప్రశాంతంగా జీవిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలపై అవసరం లేని అనుమానాలు, భావోద్వేగాలు పెరిగే పరిస్థితి ఏర్పడకూడదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తకూడదు. ప్రభుత్వాల చర్యలకు సాధారణ ప్రజలను బాధ్యులుగా చూడడం సమాజానికి హానికరం. అయితే పోలీసు వ్యవస్థ రాజకీయ ప్రభావంలో పనిచేస్తోందనే భావన బలపడితే ప్రాంతీయ వైషమ్యాలకు అది ఇంధనం పోసే ప్రమాదం మాత్రం ఉంటుంది. ఇలాంటి పరిణామాలను నివారించడం రెండు రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత.



ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరగాలని, అరెస్టు ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు పూర్తిగా పాటించబడినాయా లేదా అన్నది నిష్పాక్షికంగా పరిశీలించాలని అనేక వర్గాలు కోరుతున్నాయి. నిజంగా విధివిధానాల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం మాత్రమే ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరిస్తుంది. అదే సమయంలో తప్పుడు ఆరోపణలు అయితే అవి కూడా పారదర్శకంగా ఖండించబడాలి. వాస్తవాలు వెలుగులోకి రావడం ప్రజాస్వామ్య ప్రయోజనానికే అవసరం.

పోలీసులు ఏ ప్రభుత్వానికీ రాజకీయ ఆయుధాలు కాదు; వారు రాజ్యాంగానికి జవాబుదారీగా ఉండే ప్రజాసేవకులు. అధికార పార్టీని విమర్శించిన వారిని లక్ష్యంగా చేసుకోవడం, అరెస్టులను భయపెట్టే సాధనంగా ఉపయోగిస్తున్నారనే భావన కలిగించే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఒక జర్నలిస్టు ఇంటి వద్ద జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా పోలీసు వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తే పరిస్థితి రావడం ఎవరికీ మంచిది కాదు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం మారవచ్చు, అధికారాలు మారవచ్చు; కానీ చట్టం ముందు అందరూ సమానులనే సూత్రం మారకూడదు. అరెస్టు చట్టబద్ధమైనదైనా, ఆ ప్రక్రియలో మానవ గౌరవం దెబ్బతింటే ప్రజాస్వామ్యం ఓడిపోయినట్టే. రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడాల్సింది అభివృద్ధిలో, సంక్షేమంలో, పెట్టుబడుల ఆకర్షణలో తప్ప, పౌరహక్కులపై అనుమానాలు రేకెత్తించే ఘటనల్లో కాదు. చట్టం కంటే అధికారం పెద్దదనే సందేశం సమాజానికి వెళ్లకుండా చూడటం ప్రభుత్వాలకూ, పోలీసు వ్యవస్థకూ అత్యంత పెద్ద బాధ్యత.

## ఓ మనిషి

# మాటలు వద్దు ఆచరణే ముద్దు

మనిషి అనుకున్న విజయాలు
సాధించాలంటే తీసుకునే
సరైన నిర్ణయాలు మెరుగైన
అలవాట్లపై ఆధారపడి ఉంటాయి
ప్రతి వ్యక్తి జీవితంలో
గెలవాలి అని కోరుకుంటాడు
గెలుపు కొరకు ఏమి చేయాలో
ఆది చేయడు సాకులు
వెతుకుతాడు ధైర్యంగా
ముందుకు సాగడు
మనం ఏం మాట్లాడుతున్నాం
అనే దానికంటే రోజు ఏమి
చేస్తున్నాం అనేదే ముఖ్యం
ఎందుకంటే మన చేతలే
మన నిజమైన ఆలోచనలు
మిగతావన్నీ పై పై మాటలే
ఓ మనిషి మాటల మూటలు
విప్పకు సొల్లు కబుర్లతో
కాలయాపన చేయకు
చెల్లని రూపాయికి గీతలెక్కువ
చేతగాని వానికి మాటలెక్కువ
కోటలు దాటే పలుకులు ఎందుకు?
చేతల్లో నీ సత్తా చాటని నాడు
నీ పెదవుల సప్పుడు వ్యర్థం
ఆకాశం దాకా అబద్ధపు హామీలు
నీటిపై రాతలౌతాయి సుమా
ఆచరణలో పెట్టని ఆశయాలన్నీ
విశ్వసనీయతను దెబ్బతీస్తాయి
ఎడారిలో ఎండమావులు అవుతాయి
గొప్పలు చెప్పుకుంటే కీర్తి రాదు
పనియే దైవంగా భావించి
సరైన టైంలో సరైన ప్రణాళికతో
కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు
వస్తుంది స్ఫూర్తిగా నిలుస్తావు
నీ ప్రవర్తన నీ కార్యశీలత
నిన్ను చరిత్రలో నిలుపుతుంది
చెప్పేవాడికి వేదికలు వేలైనా
ఉంటాయి చెప్పడం సులభం
అమలుచేయడం కష్టం
చేసేవాడిక మాత్రమే
విజయాలు దక్కుతాయి
వట్టి మాటల వెల్లువ
వరద లాంటిది
సత్కార్యాల చలవ
అమృతం లాంటిది
మాటల గారడితో
మనుషులను గెలువలేం
సంఘ సంస్కర్త గురజాడ
అప్పారావు రాసిన
దేశమును ప్రేమించుమన్నా
దేశభక్తి గేయంలోని
వట్టి మాటలు కట్టి పెట్టోయ్
గట్టి మేలు తలపెట్టివోయ్
సొంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడవోయ్
అన్నవాక్యను స్ఫూర్తిగాతీసుకొని
జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి
నిజాయితీ గల పనులతో
హృదయాలను రంజింపచేయు
విమర్శల వేడికి వెరగకసాగిపో
నీనిశ్శబ్దమే నీ గెలుపుకు
జవాబు ఇస్తుంది
గొప్పలు చెప్పుకుంటే కీర్తి రాదు
కష్టపడి పని చేస్తే గుర్తింపు వస్తుంది
మాటలు కాలంతో కరిగిపోతాయి
నువ్వు చేసే మంచి పనులే
చరిత్రలో మిగిలిపోతాయి
మాటలు కాదు చేతలు ముఖ్యం
అదేనీవ్యక్తిత్వానికి నిదర్శనం
ఈరోజునీప్రయాణం మొదలుపెట్టు
నీ గమ్యాన్ని నీశ్రమతోగెలిచిచూడు
ఓ మనిషి మాటలు వద్దు
సమాజ ఉన్నతికి పాటుపడే
చేతలు ముద్దు ఆచరణే
ఆయుధం కావాలిపట్టుదలతో
ప్రగతి పురోగతియే నీ హద్దై
అభివృద్ధికి దిక్సూచి కావాలి



నేదునూరి కనకయ్య

# నీట్ రాసి డాక్టర్ కావాల్సిన విద్యార్థి సుప్రీంలో లాయర్ అయ్యాడు

**జనసైన్యం సిటి**

మధ్యప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అథర్వ చతుర్వేది అనే విద్యార్థి, ఎటువంటి లాయర్ సహాయం లేకుండా సుప్రీంకోర్టులో స్వయంగా వాదించుకుని, కేవలం 10 నిమిషాలలో తన కేసును గెలుచుకుని MBBS సీటు సాధించాడు... అథర్వ నీట్ (NEET) పరీక్షలో 530 మార్కులు సాధించి రెండుసార్లు క్వాలిఫై అయ్యాడు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యూఎస్) కోటా కింద ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీటుకు అర్హత సాధించినప్పటికీ, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ కాలేజీల్లో ఈ రిజర్వేషన్ విధానాన్ని సరిగ్గా అమలు చేయకపోవడం వల్ల అతనికి సీటు రాలేదు..

లాయర్లను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం, పైగా తన సమస్యను తానే బాగా చెప్పగలననే నమ్మకంతో అథర్వ స్వయంగా రంగంలోకి దిగాడు. రాజ్యాంగాన్ని, పాత తీర్పులను అధ్యయనం చేసి ఆన్ లైన్ ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు... కోర్టు సమయం ముగిసిపోతున్న తరుణంలో, అథర్వ జడ్జీలను చాలా వినయంగా "సార్, నాకు కేవలం 10 నిమిషాలు సమయం ఇవ్వండి"అని కోరాడు. ఆ 10 నిమిషాల్లో ఎటువంటి ఎమోషన్స్ లేకుండా, చట్టప్రకారం తనకు జరగాల్సిన న్యాయాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని చాలా స్పష్టంగా కోర్టు ముందు ఉంచాడు...

అతని వాదనలకు, చట్టంపై ఉన్న అవగాహనకు సుప్రీంకోర్టు బెంచ్ అంతా ఎంతగానో ముగ్ధులయ్యారు.



ప్రభుత్వాల పరిపాలనా లోపాల వల్ల ఒక ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదని స్పష్టం చేస్తూ, ఆర్టికల్ 142 (ఆర్టికల్ 142) కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి అథర్వకు వెంటనే ప్రైవేట్ కాలేజీలో ప్రొవిజనల్ వీడీదీూ సీటు కేటాయించాలని జాతీయ వైద్య కమిషన్ (N M C), మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది...

ఈ విధంగా ఒక సాధారణ విద్యార్థి వ్యవస్థలోని లోపాలపై ఒంటరిగా పోరాడి, దేశ అత్యున్నత న్యాయస్థానంలో విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. సుప్రీం జడ్జి అడిగి మరీ అథర్వతో ఫోటో దిగారు. అంతేకాదు జడ్జి 'నీ వాదన విన్నాక నువ్వు లాయర్ గా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుంది నీ వాదనా పటిమ బాగుంది ఆలోచించు అని సలహా ఇచ్చాడట. అయినా అథర్వ మెడిసిన్ బాట ఎంచుకున్నాడు..

# కరీంనగర్ బీసీ సంఘాల కళాశాలల బంద్ విజయవంతం



**జనసైన్యం సిటి**

బీసీ విద్యార్థి సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ అధ్యక్షతన కరీంనగర్ లో బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కళాశాలల బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగింది..

కరీంనగర్ లోని కళాశాలల బంద్ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ మాట్లాడుతూ. రాష్ట్రంలో వేలాది మంది బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ఎత్తి వేయాలని చూస్తే రాష్ట్రం అగ్ని గుండంగా మారుతుందని విద్యార్థుల జీవితాలు ఆగం చేయొద్దని హెచ్చపించారు,బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ మాట్లాడుతూ అయితే గత విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు 10000 వేల కోట్ల రూపాయలు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడం, తదుపరి విద్య మరియు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి అని అప్పుడు ఇస్తాం ఇప్పుడు ఇస్తాం అని కాలయాపన చేస్తున్నారే తప్ప బకాయిలు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్కి తరలించారని అరెస్ట్ లతో ఉద్యమం ఆగదని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కళాశాల బంద్ ద్వారా నిరసన తెలియజేస్తూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీసీ సంఘాల పక్షాన డిమాండ్ చేస్తున్నాం,ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అనుబంధ నాయకులు రంగు సంపత్,దొగ్గలి శ్రీధర్,రాచమల్ల రాజు,మంతెన కిరణ్,దొంపటీ మురళి,బ్రమ్మచారి,మాదాసు సంజీవ్,బియ్యాని తిరుపతి,బోయిని ప్రశాంత్, గాజె ప్రజ్యోత్, సంతోషిని, అజయ్, ఆదర్శ్, రాజా శేఖర్, సతీష్, శ్రీకాంత్, వెంకటస్వామి తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు,

## శనివారంపేటలో 'భూ భారతి' రీ-సర్వేపై రైతులకు అవగాహన



కొడిమ్యాల, జన సైన్యం న్యూస్.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని శనివారంపేట గ్రామంలో 'భూ భారతి రీ-సర్వే' కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధ్యక్షత వహించి రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు.రీ-సర్వే ఉద్దేశ్యం, భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకత, రైతులకు కలిగే ప్రయోజనాలపై ఆమె వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రైతుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. సర్వే నిర్వహించే సమయంలో అవసరమైన భూ పత్రాలను సిద్ధంగా ఉంచి, భూ హద్దుల నిర్ధారణలో అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో మధుసూదన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు సంచాలకులు కిషన్ ప్రసాద్, తహసీల్దార్ డి. నరేష్, ఎంపీడీవో స్వరూప, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్పంచ్, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోరెడ్డిపల్లె గ్రామంలో వృద్ధురాలు దారుణ హత్య

**జనసైన్యం సిటి**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పోరెడ్డిపల్లె గ్రామంలో వృద్ధురాలు పిసా బుచ్చవ్వ (80) దారుణ హత్యకు గురయింది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి పై గుర్తు తెలియని దుండగలు అర్ధరాత్రి దాడి చేసి గొంతు నులిమి చంపినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వృద్ధురాలి మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసు, కాళ్లకు ఉన్న 50 తులాల వెండి కడాలు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వృద్ధురాలికి ముగ్గురు కుమారులు ఉంటుండగా వారు వేరే చోట ఉంటున్నారు. ఇంట్లో వృద్ధురాలు ఒక్కతే ఉంటుండగా కుమారులు వృద్ధురాలి బాగోగులు చూసుకుంటున్నారు. ఉదయం వచ్చి చూసేసరికి వృద్ధురాలు విగతాజీవిగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం తో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని హుస్నాబాద్ ఏసిపి సదానందం పరిశీలించారు.



# చివరి లబ్ధిదారుని వరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం



**జనసైన్యం సిటి**

ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని కరీంనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం రెండవసారి ఇచ్చిన మంజూరు కలుపుకొని ఇంకా 3 వేల మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు ఇచ్చే అవకాశం ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.25 వ డివిజన్ రోడ్ నెంబర్ 9 లోని లబ్ధిదారుడు గంగాధర కనుకయ్య భాగ్యలక్ష్మిల గృహ ప్రవేశానికి స్థానిక కార్పోరేటర్ గంట శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు డబుల్ బెడ్రూం ఇండ్లిస్తామని మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు ఇల్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క లక్ష్యం అని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కల్యాణి,దండి రవీందర్,జె.లక్ష్మణ్,రాజారాం,భాస్కర్ తదితరులుపాల్గొన్నారు.




## ఏఐ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు




ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు ఈరోజు స్థానిక ఓల్డ్ హై స్కూల్ జగిత్యాల లో తెలంగాణ ప్రభుత్వ మరియు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి "అక్క-అన్న ఏఐ మెంటర్స్" కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తు ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ - ఏఐ) ఆధారంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఏఐ, కోడింగ్, కంప్యూటర్ నైపుణ్యాలను తప్పనిసరిగా నేర్చుకోవాలని, ఇవి భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి వినూత్న కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్ కేఎన్అర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ చేపట్టిన అక్క--అన్న ఏఐ మెంటర్స్ కార్యక్రమం ఎంతో దూరదృష్టితో కూడుకున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా 70 ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశపెడుతున్నామని వారన్నారు .నోడల్ అధికారి డా.సాయి మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ కోడింగ్ డిజిటల్ టెక్నాలజీలో నైపుణ్యాలను పెంపొందించుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎస్కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు అక్క--అన్న ఏఐ మెంటర్లుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోడింగ్ ప్రాథమిక అంశాలు, ఏఐ వినియోగం, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించారు. కంప్యూటర్ ద్వారా కోడింగ్ డెమోలను ప్రదర్శించి, ఏఐ ఆధారిత అనువర్తనాలను సరళంగా వివరించారు. పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి చంద్రకళ, జిల్లా అకాడమిక్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, , ఎన్సీసీ అధికారి పి. రాజు, అక్క--అన్న ఏఐ మెంటర్స్ జిల్లా నోడల్ అధికారి , శ్రీ కె. శ్రీనివాస్, పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు ఆనందరావు, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, అక్క--అన్న ఏఐ మెంటర్స్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సవాల్ చేసి తోక ముడిచిన కాంగ్రెస్!




గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైన పలు ఆరోపణలు చేసిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రులు ఆరోపణలపైన ఎక్కడైనా చర్చకు సిద్ధమని బయలుదేరిన హరీష్ రావు గారిని మార్గమధ్యలోనే అరెస్టు చేయించడం సిగ్గుచేటు! మొక్కవోని పోరాటంతో కొట్లాడి తెలంగాణ తెచ్చిన నాయకుడు హరీష్ రావు . నువ్వు సవాల్ చేస్తే భయపడడానికి నీలాగా గాలికి వచ్చిన నాయకుడు హరీష్ రావు కాదు రేవంత్ రెడ్డి! సవాల్ చేసి లెక్కలు చూపెట్టే దమ్ము లేక హరీష్ రావు గారికి భయపడి మీరు పోక ముడుచుకున్నారు రేవంత్ రెడ్డి! చర్చల పేరుతో హరీష్ రావు గారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ నాయకులు! మాజీ మంత్రి హరీష్ రావు గారిపై కక్ష సాధింపు మీకు కాంగ్రెస్ కి మంచిది కాదు రేవంత్ రెడ్డి!

ముఖ్యమంత్రి, మంత్రుల బండారం బయటపడుతుందని హరీష్ రావు గారిని చర్చలకు రాకుండా అడ్డుకున్నారు! కెసిఆర్ హరీష్ రావుల పేర్లు వినబడితేనే మంత్రులకు ముఖ్యమంత్రికి లాగుడుతడుస్తున్నాయి! రేవంత్ రెడ్డి మీ అప్పుల లెక్కలు తప్పుకాకుంటే హరీష్ రావు గారిని చర్చలకు రాకుండా ఎందుకు అడ్డుకున్నారు? కాంగ్రేసే తప్పుడు విధానాలు బయటపడకుండా కాపాడుకోవడానికె ఈ అక్రమ అరెస్టులు! రేవంత్ రెడి పైశాచిక ఆనందం కోసమే మాజీ మంత్రి హరీష్ రావు గారిని ఎండలో కూర్చోబెట్టారు! రేవంత్ రెడ్డి ప్రతి దుశ్చర్యకు సమాధానం చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉంది!ఖండించిన మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ కాముని శ్రీనివాస్.

14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన హరీష్ రావు గారిని కాంగ్రెస్ మంత్రులు సవాల్ చేసి చేతగాక తోక ముడుచుకొని పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాముని శ్రీనివాసులు మండిపడ్డారు.గురువారం రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాళ్ల మంత్రులు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కప్పిపుచ్చుకోవడానికి కపట నాటకాలతో దొంగ సవాళ్లతో చర్చలకు రమ్మని సవాలు స్వీకరించి గన్ పార్క్ వద్దకు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావు గారి రాకడను చూసిన మంత్రులు జడుసుకొని భయంతో పోలీసుల పురమాయించి గన్ పార్క్ వద్దకు రాకుండా అక్రమంగా అరెస్టు చేయించి పోక ముడుచుకొని పారిపోయిన మంత్రులు అవహేళన మానుకోవాలని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు అమీలను నెరవేర్చలేక ఇలాంటి దుచ్చెర్లతో ప్రజల దృష్టిని మళ్లించాలని కేసీఆర్ హరీష్ రావుల పైన అవాక్కులు చివాకులు పేరుతో అధికార పదముతో నోటికొచ్చినట్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రి మంత్రులు మాట్లాడుతున్నారని నిందలు వేస్తే చూస్తూ ఊరుకోమని తెలంగాణ పోరాట వీరులుగా ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నాం కాబట్టే ఇవ్వాలని సవాళ్లను స్వీకరించి అప్పుల పైన చర్చించడానికి సింహం లాగా హరీష్ రావు బయలుదేరారని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కూర మాణిక్య రెడ్డి, ఒగ్గు బాలమల్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాముని శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, మోసర్ల మధుసూదన్ రెడ్డి, కాల్వ ఎల్లయ్య, రేగుల దేవయ్య, నముండ్ల హరీష్, కింగర్ల సతీష్, పుచ్చకాయల సురేందర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ములకల కుంటయ్య, కాసర్ల రాజిరెడ్డి, పోచబోయిన స్వామి, బొల్లం చంద్రం, రాములు గౌడ్, హరీష్, స్వామి, శ్రీనివాస్, పర్షారములు, విద్యాసాగర్ రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

# కదం తొక్కిన కర్షకులు..!



**జనసైన్యం సిటి**
సాగునీటికోసం గోదావరి నదిపై వాల్ ఏర్పాటు చేస్తే సహించేది లేదని కర్షకులు కదం తొక్కి అధికారులను నిలదీశారు. వారు నిర్మాణం చేపడితే జగిత్యాల జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే పనులను ఆపాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం ఇచ్చి వేడుకున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామం లో గోదవరి నది పైన గంగనాల అయకట్టు కు నిరు రాకుండా సదర్ మాట్ బ్యారేజీ క్రీంద పోరుమత్తడి సెడ్ వాలు ఎర్పాటు చేసెందుకు అనుమతులు ఇచ్చారని కోరుతూ గురువారం గంగనాల అయకట్టు క్రింద ఉన్న వేములకుర్తి, యామపుర్, ఫకిర్ కోండాపుర్, మల్లపుర్ మండలం నడికుట,మెగిలిపెట్, ఓబులాపుర్,సంఘెం శ్రీరాంపుర్, దామరాస్ పెల్లి, వాల్గొండ గ్రామలకు చెందిన రైతులు వేములకుర్తి గ్రామంలో సమావేశం నిర్వహించుకున్నారు.గంగనాల కు వచ్చె నీటీ పాయలో అడ్డుకట్ట నిర్మాణం అపాలని పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి పెద్ద ఎత్తున నిరసన చేపట్టాలని రైతులు సంఘటితమగుతున్న క్రమంలో విషయం సదర్ మార్ట్ బ్యారేజ్ అధికారులకు తెలుపగా గ్రామానికి వచ్చి విషయం వివరిస్తామని అధికారులు సూచించారు.

అదికారులను నిలదిసిన రైతులు....

నిర్మల్ జిల్లా పోన్ కల్ జగిత్యాల జిల్లా ములరాంపుర్ గ్రాణల మధ్య నిర్మాణం చేసిన సదరు మాటు బ్యారేజ్ రెండు జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తు ఉపయోగపడాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో 1959 లో నిర్మాణం చేసిన గంగనాల అయకట్టు రైతులకు అడ్డు గోడ ( సైడ్ వాల్) నిర్మాణంతో మీరు రాక ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అడ్డుగోడ నిర్మాణం జరిగితే 6 వేల ఎకరాలకు నీరు అందదని బ్యారేజీ అదికారులు ఈఈ అనిల్,డిఈ సురేందర్, ఎఇ నవిన్ కుమార్ లను నిలదీశారు. సైడ్ వాల్ నిర్మాణం ఆపాలని కోరారు.

జిల్లా అధికారుల సమక్షంలో వినతి పత్రం...

సదరు మాట్ బ్యారేజ్ క్రింద జగిత్యాల కు నిరు వచ్చే గోదవరి నది పాయ ప్రాంతంలో సెడ్ వాలు నిర్మాణ చెయ్యద్దని కోరుతూ ఇబ్రహింపట్నం తహశీల్దార్ వరప్రసాద్,ఎఇ కవిత, ఎస్ ఐ నవిన్ కుమార్ సమక్షంలో ఇబ్రహింపట్నం,మల్లపుర్ మండలం లోని 9 గ్రామలకు 6 వేల.ఎకరాల కం సాగునీటి సమస్య తలత్తకుండా చుడాలని కోరుతూ సదర్ మాట్ అదికారులకు అయకట్టు రైతులు, ప్రజా ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

1959 లో గంగనాల ప్రాజెక్టు....

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గోదావరి నదిపై అప్పటి మంత్రి జువాడి నర్సింగరావు ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామాపూర్, పకిర్ కొండాపూర్ మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపేట్ ,ఓబులాపూర్ ,దామరాసుపల్లి సంఘం శ్రీరాంపూర్, వాలోగొండ 9 గ్రామాలు 4వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయించి ఖరీఫ్, రబీ రెండు పంటలు ఆయకట్టు కింద నీరందుతోంది.

సదర్ మార్ట్ బ్యారేజ్ నిర్మాణంతో గంగనాలకు అన్యాయం...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ – జగిత్యాల లలోని జిల్లాల రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో పున్ కల్ – మూలరాంపూర్ గ్రామాల మధ్య ఉన్న గోదావరి నదిపై 55 గేట్లతో సదర్ మార్ట్ బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేసింది. దిగవాన ఉన్న గంగనాల అయకట్టుకు రెండు పంటలకు నీరందేందుకు అప్పట్లో ఉన్న అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక తూమును ఏర్పాటు చేసి నీరు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నమ్మబలికి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసినట్లు ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



**కొడిమ్యాల, . జన సైన్యం న్యూస్.**
**జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని శనివారంపేట గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ స్థాయిలో జరుగుతున్న ఇంటింటి సర్వే, షెడ్యూళ్ల పంపిణీ, ఓటరు వివరాల సేకరణ, నమోదు ప్రక్రియలను పరిశీలించిన ఆమె, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరును గుర్తించి, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) సహకరించాలని సూచించారు. కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ డి. నరేష్, ఎంపీడీవో స్వరూప, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.**

## ఎన్నికల వాతావరణాన్ని తలపించిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ హౌస్ ఎలక్షన్స్

**జనసైన్యం సిటి**







విద్యార్థులకు బాల్యదశ నుండే నాయకత్వపు లక్షణాలను అలవర్చాలని, వివిధ రకాల ఎన్నికల గురించి తెలియపరచాలని, ప్రధానంగా పోటీలో ఉండడానికి చాలా ప్రోత్సాహం అందించాలని మరియు వాటి యొక్క ప్రభావాలను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా పాఠశాల వ్యవస్థ చాలా చక్కగా కొనసాగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉ ఎన్నికల వాతావరణ తలపించే విధంగా నిర్వహించినటువంటి హౌస్ ఎలక్షన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో పోటీదారులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపి సమయాన్ని వృధా చేయకుండా గుర్తులను విస్తృతంగా ప్రచారం చేసి గెలువు పొందాలని వారు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓట్లనే అభ్యర్థించడం చాలా కీలకమైనదని మరియు అత్యుత్తమ ఓట్లు రావడానికి చాలా కృషి చేయాలని వారు చెప్పారు. పాఠశాల ప్రాంగణంలో అత్యుత్తమ ఓట్లు రావడానికి చాలా కృషి చేయాలని వారు అభిప్రాయపడ్డారు. పాఠశాల ప్రాంగణంలో హౌజ్ ఎలక్షన్స్ పురస్కరించుకొని వివిధ విభాగాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులను సరస్, తేజస్ లక్ష్య, ధ్రువ హౌస్ విద్యార్థులుగా విభజించబడ్డారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకంగా వ్యవరించడమే కాకుండా ప్రజల యొక్క అభివృద్ధి సైతం ఓట్ల మీద ఆధారపడి ఉన్నదని గుర్తు చేశారు. ఓటు హక్కు చాలా విలువైనదని మరియు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని బాధ్యతయుతమైన ప్రతినిధులను ఎన్నుకోవాలని వారు చెప్పారు. అది పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యత ఉన్నదని మరియు ఓటు హక్కు ద్వారా ఎంపిక చేసుకొని వారికి కావాల్సిన వనరులను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పాఠశాలలోని వివిధ విభాగాలకు ఎన్నికలు నిర్వహించడం ఒక గొప్ప సాంప్రదాయమని. తెలుపుతూ ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ విద్యార్థులకు నమ్మకాన్ని పెంపొందించాలని వారు చెప్పారు. ఎన్నికల





ప్రక్రియను నరేందర్ రెడ్డి పర్యవేక్షించారు మరియు పోటీదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు అందరూ చాలా ఉత్సాహంగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాలను త్వరలో ప్రకటించడం జరుగుతుందని మరియు ప్రమాణ స్వీకారం చాలా గొప్పగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోటీదారులందరూ వారి గుర్తులను ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.